
# సత్తు రూపాయి

— ఎ. విశ్వేశ్వరరావు




వీధి స్తంభం వెలుగులో పరీక్షగా చూశాడు సుబ్బారావు. "సత్తు రూపాయి." అయ్యరుహోటల్లో కాఫీ తాగినప్పుడు తన దగ్గరికి వచ్చి ఉండాలి ఇది. ఎలాగైనా దాన్ని మార్చాలనిపించింది అతనికి. ఎవరికి మటుకు వుంటుంది? దాన్ని తన దగ్గర వుంచుకోవాలని!

దూరంగా ఒందరు మిఠాయి దుకాణం కనిపించింది. దుకాణం చుట్టూ జనం విరగబడుతున్నారు. మెల్లిగా గుంపులో జొరబడి చేతిని ముందుకు చాచాడు. కొట్టువాడు హడావుడిగా అరుస్తున్నాడు, డబ్బులు గల్లాలోకి విసురుతున్నాడు. ఇచ్చిన డబ్బు కూడవన్నా చూడటంలేదు. "పావలా పకోడి." అరిచాడు సుబ్బారావు. చేతిలో రూపాయి బిళ్ల పట్టుకు ఎవరితోనో మాట్లాడుతున్నాడు కొట్టువాడు. సుబ్బారావుకి భయం వేసింది. వాడు చేతిలో రూపాయిని చూసుకుంటా డేమోనని. అందరూ తననే చూస్తున్నట్లుగా తోంచి.

"ఎవరిదండీ ఈ రూపాయి?" కొట్టువాడు ప్రశ్నించాడు. "నాదే.." ఏదో చెప్పబోయాడు సుబ్బారావు నాలిక తడుపుకుని. "పావలా పకోడీలు కదూ అడిగారు?" చటుక్కున డబ్బు లోపల పడేసుకున్నాడు. సుబ్బారావు గుండె కుదుటపడింది. మూడ్పావలా, పకోడీలు తీసుకుని హుషారుగా, పడకలాటి నడుగు పెట్టాడు.

* * *

మల్లెపూల కొట్టు దగ్గరికి వచ్చేసరికి, పూలు తీసుకోవాలని గుర్తు కొచ్చింది సదానందానికి. కుడి చేతిలోని స్వీట్సు పాకెట్‌ని ఎడమ చేతిలోకి మార్చి, జేబులో చెయ్యిపెట్టి రూపాయి కాసు బయటికి తీశాడు. ఆ రూపాయ వింతగా అనిపించింది సదానందానికి. బయటకు తీసి లాంతరు వెలుగులో పరీక్షించాడు. సత్తురూపాయ. ఒళ్లు మండింది సదానందానికి. అసలే నెల చివరిరోజులు. కరువులో అధిక మాసం. "సరే! ఏంచేస్తాం! అంతా ఖర్మ." తన అజాగ్రత్తని 'నాఖర్మ' సిద్ధాంతంతో జవాబు చెప్పుకున్నాడు.

"ఎవరిచ్చివుంటారూ? ఇంకెవరూ? ఆమిఠాయి కొట్టువాడే!" మళ్లీ వెళ్లి ఇచ్చి వద్దామనిపించింది సదానందానికి. దూరం గుర్తు కొచ్చేసరికి, నీరసం ముంచుకొచ్చింది. 'ప్రీసీ రేపు వెళుదాం అని సరిపెట్టుకోబోయాడు. "అదేమిటి సార్! మా దగ్గర అసలు సత్తురూపాయలు వుండనే వుండవు." అంటే వాడు?" అది జేబులో బరువుగా అనిపించసాగింది సదానందానికి. ఏమయినాసరే మార్చాలనిపించింది.

మెల్లిగా పూలకొట్టు దగ్గరికి నడిచాడు సదానందం. 'ఎలాగయ్యా మూర?' పూలదండలని చూచి అడిగాడు సదానందం.

"మూర పావలా." కొంచెం తల బిరుసుగానే వుంది సమాధానం.

"రెండు మూరలివ్వు." బిరుగ్గా అడిగాడు సదానందం.

రూపాయ అతని చేతిలో పెట్టాడు. అంతే! "ఇదేం రూపాయయ్యేవ్ తీసుకో, తీసుకో?" తిరిగి తన చేతిలోనే పెట్టేశాడు.

"ఈ రూపాయకేమోయ్? నిక్షేపం లాటిది?" ఎంత వద్దనుకున్నా అతని మొహం రంగులుమారాయి. జేబులో అదృష్టవశాత్తు రెండు పావలాలు వున్నాయి. "పోన్లే! ఇవి తీసుకో!"

దీపం వెలుగులో ఆ పావలా బిళ్లల్ని శల్యపరీక్ష చేస్తుంటే, వాడిని మింగేద్దామనిపించింది సదానందానికి.

మల్లెపూల దండ తీసుకుని నడచి వచ్చేసరికి, వెనకాల నవ్వులు వినిపించాయి. ఆ కొట్టువాడు ప్రక్కవాడితో అంటున్నాడు. "ఆడి నాలకం ఇందాకట్నుంచి చూస్తునే వున్నా! దొంగి యవ్వారంగాడని ముందే అనుకున్నాలే!" మళ్లీ నవ్వు. సదానందం తరువ ఎతున్నట్లుగా పరిగెత్తాడు.

సదానందానికి ఇంకోసారి ప్రయత్నం చేయాలని పించింది ఇంకెవరితోనైనా. రిక్షా మాట్లాడేటప్పటికి ఒక ఆలోచన మెదిలింది అతని మనస్సులో. "రిక్షా వాడికిచ్చేస్తేసరి! వాళ్లెక్కడైనా మార్చేసుకుంటారు. వాళ్లకి ఇటువంటివి అలవాటేగా."

"ఏయ్ రిక్షా! వస్తావా?"

"ఎక్కడికి బాబూ?"

"నల్లపాడు చెరువు దగ్గరకి."

"చెరువు దగ్గర ఎక్కడండీ?"

ఇంటికి తీసుకెళితే, తాను రాత్రి ఇచ్చిన రూపాయి సత్తుదని తెలిస్తే, పొద్దున్నే మళ్లీ తయారవుతాడు వీడు.

"చెరువు దగ్గరే దిగిపోతా! లోపలికి పోనక్కర్లేదులే."

"అర్ధరూపా యిప్పించండి."

ఇంకోసారైతే బేరమాడే వాడే! మరి తన అవసరం. ఏమైనాసరే, ఆ రూపాయ మార్చాలి.

"పద! పోనీ!."

పావలా బేరానికి, అర్ధరూపాయ వస్తోందని మస్తానుకి చాలా ఉత్సాహంగా వుంది. జోరుగపోతున్నాడు. "ఇవాళ పుల్లిగాడి హోటల్లో బాగా తినచ్చు, వాడు కూరలూ అవీ ఎంత రుచిగా చేస్తాడనీ?" నోరు వూరిపోతోంది మస్తానుకి.

రిక్షాలో కూర్చున్న సదానందం ఆలోచనలు వేరే విధంగా వున్నాయి. రిక్షా దిగంగానే వాడికి రూపాయ ఇస్తాడు. వాడు అది సత్తుదని కనిపెడితే? వాడి కివ్వటానికి తన దగ్గర ఇంక డబ్బులు లేవే? ఇంటి దగ్గరైనా వుం ాయని నమ్మకంలేదు. గుండె గుబేలుమంది సదానందానికి.

రిక్షా మెయిన్ రోడ్డు దిగి మలుపు తిరిగింది. సదానందానికి చెమట పోస్తోంది. ఏడుకొండలవాడి దయ అనుకున్నాడు సదానందం.

"దిగండి బాబూ" అన్నాడు మస్తాను.

రిక్షా దిగాడు సదానందం.

మెల్లిగా రూపాయి మస్తాను చేతిలో పెట్టాడు. మాట్లాడకుండా జేబులో వేసుకున్నాడు. అర్ధరూపాయి చేతిలో పెట్టాడు.

* * *

రిక్షా నడిపిస్తున్నాడు మస్తాను. ఆనందంగా వున్నప్పుడు అట్లా చేయడం వాడి అలవాటు. పుల్లిగాడి హోటల్లో భోజనం గురించి ఊహించుకుంటున్నాడు మస్తాను.

"పుల్లయ్యా! భోజనం పె ్!" కేక వేశాడు. "అరువులు లేవురా!" ప్రతిమాలుతున్న ధోరణితో అన్నాడు పుల్లి.

నిర్లక్ష్యంగా రూపాయ బిళ్ల విసిరేశాడు బల్లమీదకి మస్తాను.

"ఇదిగో! నిన్నటికీ, ఇవాల్టికీని."

కిసుక్కున నవ్వేడు పుల్లి. "ఎక్కడిదిరా నీకిది?"

"ఏం?" తెల్లబోయాడు మస్తాను. "నన్నేరా నీవు మోసం చేసేది?"

చేతిలోకి తీసుకున్నాడా రూపాయిని మస్తాను. అతనికి దుఃఖం వచ్చింది. రూపాయ నష్టం. వడ్డించిన

విస్తరి ముందు నుంచి లేచి వచ్చాడు మస్తాను.

"ఫరవాలేదులే! ఇవాళ్టికి తిను." జాలి ధ్వనించింది పుల్లి కంఠంతో.

"ఏం ఫరవాలేదు." గంభీరంగా అవి బయలుదేరాడు మస్తాను.

మనసు కుతకుత లాడింది మస్తానుకి. నెమ్మదిగా సత్రం అరుగు మీద చేరాడు. బిచ్చగాళ్ళు, రోజు సంపాదనంతా ఏంచుకుంటున్నారు. గొంగగుడ్డోడు మనవడితో ఏదో మాట్లాడుతున్నాడు. వాడు గొంగి గుడ్డాడని అందరికీ తెలిసినా, తెలిసిన వాళ్ళ దగ్గరే వాడింకా నటిస్తాడు.

చటుక్కున ఒక ఆలోచన తట్టింది మస్తానుకి. గుడ్డోడు 90 నయాపైసలిచ్చి రూపాయలు కూడ బెడతాడని. వాడి మనసులో పాపం, పుణ్యం రాలేదు. ఎలాగైనా రూపాయ మార్చాలి అంతే."

"తాతా? పైసలిస్తావేటి? రూపాయిస్తా."

"ఎవరదీ! మస్తానా! నీ కెందుకురా పైసలు." నవ్వాడు గుడ్డితాత.

"సరేలే తీసుకో! ఒరే చిన్నోడా! మస్తానుకి పైసలివ్వరా!"

రూపాయి కాసు చేతిలో పెట్టాడు మస్తాను. నేల మీద మోదించి చూశాడు తాత. బోడ్డు దోప్పుకున్నాడు.

*　　　*　　　*

బజారులో నడుస్తున్నారు తాత, మనవడు. సేవ్‌సెంటు దగ్గర కొట్టు దగ్గం ఆగారు. తాతకి చిన్నాళ్ళ నుంచో అమూలన వలాడుతున్న ఎర్రలాగూ మనవడికి కొనిపెట్టాలని వుంది. ఇదిగో! ఇవాళ్టికి పైసలు పోగయ్యాయి.

"బాబూ! ఆమూలని ఎర్రలాగూ ఎంతండి?"

"మూడుంబావలా!" తేరిపార చూచాడు.

"ఒరేయ్! నీవు గుడ్డినాడవైతే, ఆ లాగు ఎలా కనపడిందిరా?" వాడు ఆశ్చర్యపోయాడు.



"ఏదో! పొట్ట కోసం బాబూ"

"ఇదిగో చిన్నాడా? డబ్బు లివ్వరా?"

లాగూ తీసుకున్నాడు "చిన్నాడు." వాడి మొహములో ఆనందం వెల్లివిరుస్తోంది.

"ఏయ్! వెల్లని రూపాయిస్తావేందా!" గద్దించాడు కొట్టువాడు.

"వెల్లని రూపాయా!" చేతిలోకి తీసుకుని పరీక్షగా చూచాడు. అంతా అర్ధమయింది వాడికి.

కొట్టువాడు లాక్కున్నాడు లాగూని వాడి చేతిలోంచి. చిన్నబోయింది చిన్నాడి మోహం.

తాత పెదాల మీగ చిరునవ్వు వెలిసింది. "ఒరేయ్ చిన్నాడా! సత్రానికి పారా! వేవస్తాలే."

గబగబా నడుస్తున్నాడు తాత బజారులోంచి. సందులు, గొందులు తిరిగి ఒక పాక ముందు చేరాడు. "ధనుర్దాసూ!" కేకేశాడు తాత. ఇదిగో వస్తున్నా.

మంతనాలు జరిగాయి. ముప్పావల చేతిలో పోసేస్తూ, ముసలాడు ఇంటి ముఖం పట్టాడు.

ఈ కధలో రూపాయ బిళ్ల చాలా చేతులు మారింది. దీనివల్ల ఎందరో కష్టాలు, మానసిక వ్యధ పొందారు. ఏది ఏమైనా, సుబ్బారావు మిఠాయి కొట్టు వైపు వెళ్లడం లేదు. సదానందం మళ్లా వాడి దగ్గర పువ్వులు కొంటే ఒట్టు. గుడ్డితనం, తెలిసిన వాళ్ల దగ్గర నటించటం మంచిది కాదని తెలుసుకున్నాడు గుడ్డివాడు. మస్తాను సత్రపు ఛాయలకే వెళ్లడం మానుకున్నాడు. కాని, ఆ రూపాయ మటుకు, అలాగే వుంది. ధనుర్దాసు దగ్గరకే చివరికి చేరిందంటే....

మధ్యాహ్నం బజార్నుంచి వచ్చి, సొరుగులాడేసరికి అయ్యారు కళ్లు జిగేలుమన్నాయి. భూమి గుండ్రంగా వుందని అతనికి అప్పుడే తెలిసింది. ఏళ్ల తరబడి, తను మార్చలేకుండా వున్న రూపాయ, నిన్న సుబ్బారావు చేతిలోకి నంపబడిన రూపాయ, ఇరవైనాల్గు గంటలలో తిరిగి తన దగ్గరకే చేరింది. ఆ 'సంవత్సరం' మీద పొట్టు అతనికి బాగా గుర్తు. అదే, ఆరూపాయ.

బిత్తరపోవడం తప్ప ఏం చేయలేకపోయాడు అయ్యరు.

కాని! వాడికేం తెలుసు? తన దగ్గర పని చేస్తున్న ధనుర్దాసు, సత్తు బిళ్లల్ని చవగ్గా కొని, తన క్యాష్ బాక్సులోని బిళ్లలతో మారుస్తాడని, అప్పుడప్పుడూ తను క్యాష్ అప్పచెప్పేటప్పుడు?

